
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
గురువారం 18 జులై 2024



జాతీయ రహదారిపై ప్రమాద సూచికలు ఏర్పాటు

కోటపల్లి, జూలై 17: రోడ్డుప్రమాదాల నివారణలో భాగంగా బుధవారం మండలంలోని 63వ నెంబరు జాతీయ రహదారిపై పారుపెల్లి-రాంపూర్, బబ్బెరచెలక తదితర గ్రామాల పరిధిలో చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్‌ఐ రాజేందర్‌ల ఆధ్వర్యంలో ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఈ రహదారిలో వాహనదారులు అతి వేగంగా ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ప్రమాద సూచికల బోర్డును ఏర్పాటు చేసినట్లు పోలీసులు వివరించారు. అలాగే వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, పరిమితికి లోబడిన వేగంతో ప్రయాణించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని వాహనదారులకు అవగాహన కల్పించారు.

ధర్నాకు తరలిరావాలి

జన్నారం, జూలై 17: మంచిర్యాల కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించే బీడీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు రాజేష్, అరుణ అన్నారు. జన్నారంలో బుధవారం వారు మాట్లాడుతూ బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ. 4 వేలు బీడీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న బీడీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాల్సిన ప్రభుత్వాలు కూలీ రెట్లు పెంచడం లేదన్నారు. వెంటనే కూలీ రేట్లు పెంచాలని కోరారు. బీడీ కార్మికులు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రుణమాఫీపై నేడు సంబరాలు

జన్నారం, జూలై 17: జన్నారం రైతు వేదికలో గురువారం రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నామని ఏవో సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రుణమాఫీ ప్రారంభించే కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించవచ్చని తెలిపారు.

భీమారం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం భీమారం రైతు వేదికలో సంబరాలు నిర్వహించనున్నామని మండల వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని, రైతులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

లక్షెట్టిపేటరూరల్, జూలై 17: లక్షెట్టిపేట పట్టణంలో పాత బస్టాండ్ ఏరియాలో శేశోద్యల ప్రతాప్‌సింగ్(55) అనే వ్యాపారి ఆర్థిక ఇబ్బంది లతో తన దుకాణంలో మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ప్రతాప్‌సింగ్ తన భార్య ఉమతో కలిసి బోళ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా వ్యాపారం సరిగ్గా సాగడం లేదు. అప్పులు చేశాడు. గత కొన్ని రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులతో మరో వ్యాపారం చేసి డబ్బు పోగొట్టుకుని ఇబ్బంది పడుతున్నాడు. ప్రతాప్‌కు కూడా ఇతరులకు అప్పుగా ఇచ్చిన సుమారు కోటి రూపాయలవరకు రావాల్సి ఉంది. తనకు రావాల్సిన డబ్బు సమయానికి రాకపోగా తను తెచ్చిన చోట ఇచ్చిన మాట ప్రకారం చెల్లించలేక పోతున్నానని మనో వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తను ఇచ్చే అప్పు వివరాలు అదే విధంగా తనకు ఇవ్వాల్సిన వారి వివరాలు మొత్తం సూసైడ్ నోట్‌లో రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం దుకాణంలో పనిచేసే వ్యక్తి వచ్చి షెట్టర్ తెరిచిచూడగా ప్రతాప్ ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. దీంతో అతడు ప్రతాప్‌సింగ్ భార్యకొడుకులకు సమాచారం ఇచ్చాడు. భార్య ఉమ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో అసోసియేట్ ప్రొఫెసర్ మృతి

- బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ



లింగయ్య (ఫైల్)

మందమర్రిటౌన్, జూలై 17: పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ జి లింగయ్య(56) ఇటీవల గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలుసుకున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు.



నేటి నుంచి రుణమాఫీ

రైతులకు గురువారం నుంచే రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి మంగళవారం ప్రకటించారు. రూ.లక్ష లోపు ఉన్న రుణాల సొమ్మును ఆ రోజు సాయంత్రం కల్లా రైతుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్నారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుందని చెప్పారు. కేవలం కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- రైతుల ఖాతాల్లో నగదు జమకు ఏర్పాట్లు
- ఇప్పటికే విడుదలైన మార్గదర్శకాలు
- 2023 డిసెంబర్ 9 వరకు కటాఫ్
- జిల్లాలో 94 వేల మంది రైతులకు లబ్ధి

మంచిర్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని సుమారు 94వేల రైతులకు లబ్ధి చేకూరనుంది ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ నెల 18న అర్హతగల రైతులకు రూ. లక్ష వరకు ప్రభుత్వం బ్యాంకుల్లో నగదు జమ చేయనుంది. ఈ నెలాఖరులోగా మరో రూ. 50వేలు జమచేయనున్నారు. ఆగస్టులోగా రెండు లక్షల రూపాయలు పూర్తి స్థాయిలో మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెబుతున్నారు. ఇందులో భాగంగా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య కాలంలో తీసుకున్న రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయనుంది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.

● జిల్లాలో 94 వేల మంది అర్హులు..

ప్రభుత్వ నిర్ణయం మేరకు రుణమాఫీ పథకానికి జిల్లాలో 94వేల పై చిలుకు మంది రైతులు అర్హత కలిగి ఉన్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా లక్షా 57వేల మంది రైతులు ఉండగా వివిధ రకాల పంటలు 3.42 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. జిల్లాలో ఉన్న రైతుల్లో 25వేల వరకు కౌలు రైతులు కూడా ఉన్నారు. ఐదెకరాల పైబడి ఉన్న రైతులకు మాత్రమే బ్యాంకర్లు రూ. 2 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. గత వానాకాలం సీజన్ నుంచి రూ. 2 లక్షల వరకు పంట రుణం తీసుకున్న వారిలో 94వేల మంది వరకు ఉన్నట్లు బ్యాంకర్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు వీరందరికీ రుణమాఫీ చేయాలంటే రూ. 804.22 కోట్ల వరకు అవసరం ఉంటుందని అధికారుల అంచనా. ప్రతి ఏటా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకుంటూ కొత్త రుణాలు పొందినట్లు బ్యాంకర్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో యేటా వానాకాలం, యాసంగి పంట రుణాల కింద రూ. 1600 కోట్ల వరకు బ్యాంకులు ఇస్తున్నాయి.

రుణాలు తీసుకున్న రైతుల సమాచారం బ్యాంకర్లు ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశారు.

● రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు..

రైతు కుటుంబాన్ని గుర్తించడానికి ఆహార భద్రతాకార్డు వివరాలు ప్రామాణికంగా రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. రాష్ట్రంలో ఉన్న షెడూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకారం కేంద్ర బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తించనుంది. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక నోడల్ అధికారిని నియమించగా, ఆ అధికారి నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్‌కు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. డిసెంబరు 12, 2023 నాటికి రైతుకు ఉన్న రుణం, లేక రెండు లక్షల వరకు ఏది తక్కువైతే దాన్ని పొందేందుకు రైతులు అర్హులు. అలాగే రెండు లక్షల మించిన రుణం ఉన్న రైతులు ఆపైన ఉన్న రుణాన్ని మొదట చెల్లించాల్సి ఉంటుందనే నిబంధన ఉండగా, ఆ తరువాతనే రుణమాఫీ పొందే వెసులుబాటు కల్పించింది. ఒకవేళ రెండు లక్షల కంటే ఎక్కువ రుణం పక్షంలో కుటుంబంలో మహిళల పేరిట ఉన్న రుణాన్ని మొదట మాఫీ చేయనున్నారు. అనంతరం పురుషుల రుణమాఫీ చేస్తారు. రైతులు పీఏసీఎస్‌ల ద్వారా తీసుకున్న పంట రుణం మాత్రమే మాఫీ చేయనుండగా, కంపెనీలు, ఇతర ఫర్మ్‌ల పేరిట పొందిన రుణాలకు ఈ పథకాన్ని వర్తింపజేయరు. కాగా రుణమాఫీ పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను బ్యాంకర్లు ఇతర ఖాతాల్లో జమ చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. కాగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫేస్ -1 కింద 18న రైతులకు లక్ష వరకు రుణమాఫీ చేస్తుండడంతో ఘనంగా సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం సాయంత్రంలోపు బ్యాంకుల్లో రుణమాఫీ నగదు జమ చేయగానే మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో కలిసి సంబరాల్లో పాల్గొననున్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఏసీసీ, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం జూలై 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు 17.29 శాతం డీఏ పెండింగ్‌లో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను చిన్న చూపు చూడడం తగదని చెప్పారు. పీఆర్‌సీ గడువు ముగిసి సంవత్సరం గడుస్తున్నా కొత్త పీఆర్‌సీ ఊసెత్తకపోవడం శోచనీయమన్నారు. బహుళ సబ్జెక్టుల పదోన్నతుల కారణంగా ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను అర్హులైన ఎస్టీటీ ఉపాధ్యాయులతో నింపాలన్నారు. ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేసి కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు పాత పాఠశాలల్లో కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, రాష్ట్ర అకాడమిక్ కో కన్వీనర్ విద్యాసాగర్,రమాదేవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ

చెన్నూరు, జూలై 17: చెన్నూరు ఎస్‌ఐగా సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సీఐ రవీందర్, ఎస్‌ఐ శ్వేత, సిబ్బంది స్వాగతం పలికారు. సుబ్బారావు మంచిర్యాల నుంచి బదిలీపై సుబ్బరావు చెన్నూరుకు వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుడికి చేయూత

నెన్నెల, జూలై 17: రోడ్డ ప్రమాదంలో గాయపడిన పారిశుధ్య కార్మికుడికి దాతలు అండగా నిలిచారు. చికిత్స కోసం విరాళాలు సేకరించి రూ.19,051లను బుధవారం అందజేశారు. ఆవడం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు వెలగటూరి లక్ష్మణ్ వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. రూ. 2 లక్షలకు పైగా ఖర్చులు అవుతాయని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకున్న కొవిడ్ వలంటీర్స్, సోపతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు జలంపల్లి శ్రీనివాస్ సామాజిక మాధ్యమాల ద్వారా విరాళాలు సేకరించారు. జమ చేసిన నగదును సభ్యులు నీలాల శ్రీనివాస్, మల్లేష్‌లతో కలిసి కరీంనగర్‌లో బాధితుడి కుటుంబీకులకు అందజేశారు.



- పక్క రాష్ట్రాల నుంచి జిల్లాకు సరఫరా
- యువతే లక్ష్యంగా విక్రయాలు
- మత్తులో నేరాలకు పాల్పడుతున్న వైనం
- ఆరు నెలల్లో 38 మంది అరెస్టు
- 11 క్వింటాళ్ల, 217కిలోల గంజాయి స్వాధీనం

బెల్లంపల్లి, జూలై 17: జిల్లాలో గంజాయి విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. యువతే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. సిగరెట్లలో గంజాయిని నింపి విక్రయిస్తూ యువకులు, విద్యార్థులను మత్తులో ముంచుతున్నారు. జిల్లాకు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల నుంచి రైళ్లల్లో జిల్లాకు అక్రమ రవాణా చేస్తున్నారు. జిల్లాలోని కొందరు వ్యక్తులు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లర్లతో చేతులు కలిపి జిల్లాకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇటీవల పలు సంఘటనల్లో రైల్వే స్టేషన్‌లలో గంజాయితో పట్టుబడుతుండడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా యువతే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తుండడంతో చదువుకునే వయస్సులోనే గంజాయి మత్తులో నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పల్లె పట్టణం అని తేడా లేకుండా జిల్లాలో చాపకింద నీరులా గంజాయి విస్తరిస్తుంది.

● ఆరు నెలల కాలంలో..

జిల్లాలో గడిచిన ఆరు నెలల వ్యవధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కేసులు 24 నమోదయ్యాయి. నిందితుల నుంచి 11క్వింటాళ్ల 217కిలోల గంజాయితోపాటు 28 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ. 6 లక్షలకు పైగా ఉంటుంది. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న 38 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రైళ్ల ద్వారా పెద్ద మొత్తంలో గంజాయి రవాణాచేస్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల నుంచి పలు రైళ్ల ద్వారా గంజాయిని స్మగ్లర్లు రవాణా చేస్తున్నారు. జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు పక్క రాష్ట్రాల్లో ఉన్న గంజాయి గ్యాం గులతో సంబంధాలు పెట్టుకుని గంజాయిని కొనుగోలు చేసి జిల్లాకు తీసుకువస్తు న్నారు. ఏకంగా కొందరు యువకులైతే గంజాయి అమ్మకాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. మహారాష్ట్ర, ఒడిస్సా ప్రాంతాల్లో గంజాయి కిలో రూ. 8 వేల నుంచి 10 వేలు ఉండగా జిల్లాలో రూ. 40 వేల నుంచి 50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల బెల్లంపల్లి, మంచిర్యాల, రామకృష్ణపూర్ రైల్వేస్టేషన్‌లలో పక్క రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకువచ్చిన వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.



గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

● పాఠశాలలు, కళాశాలలే..

జిల్లాలోపాఠశాలలు, కళాశాలలే అడ్డాగా కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారు. సిగరెట్లలో గంజాయిని నింపి పాన్‌షాపులకు, నేరుగా యువకులకు అమ్ముతున్నారు. ఇటీవల ఓ కళాశాల ఆవరణలోని వార్డు ప్రజలు కళాశాల విద్యార్థులు గంజాయి తాగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. గంజాయి సేవిస్తూ మత్తులో దారి తప్పుతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో గంజాయి మత్తులో నేరాలకు పాల్పడిన సంఘటనలు తరు బచూ చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ నియంత్రించలేకపోతున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కొందరు గంజాయి సాగు చేస్తున్నారు. దీంతో యువత తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఊరూరా ఉత్సాహంగా ఊరేగింపులు



మంచిర్యాలలో పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న ప్రజలు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 17: మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లీం మత పెద్దలు ఉస్మాన్ అలీ, ఎండీ షకీర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పీరీల ప్రదర్శన నిర్వహిం చగా కుల మతాలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖారాం చౌరస్తా వద్ద పీరీలకు భక్తులు కానుకలు సమర్పించుకున్నారు.

హాజీపూర్: మండలంలో మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా ప్రజలందరు మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. పీరీలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నర్సింగాపూర్ గ్రామంలో పీరీల ఊరేగింపు నిర్వహించారు.

నస్పూర్: పట్టణంలో మొహర్రం వేడుకలు పట్టణ వాసులు భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. పట్టణంలోని పురవీధుల్లో పీర్లలను డప్పు చప్పుళ్ళతో ఉరేగింపు నిర్వహించారు. భక్తులు దర్శించి మొక్కులు చెల్లించారు.

దండేపల్లి: మండల కేంద్రంలో పాటు ముత్యంపేట, రెబ్బనపల్లి, మ్యాదరిపేట, మామిడిపల్లి, నాగసము దం, తాళ్ళపేట పలు గ్రామాల్లోని మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం పీరీల ఊరేగింపు చేశారు. హుస్సేన్, హుస్సేన్‌లను కొలుస్తూ వారి త్యాగాలను స్మరిస్తూ పీర్ల వద్ద భక్తులు భక్తిశ్రద్దలతో ప్రార్ధనలు చేశారు. రాత్రివేళ్లతో పీరీల గుండం వద్ద అసైదూల హరతీ అంటు ఆటపాటలతో సందడి చేశారు.

మందమర్రిటౌన్: మొహర్రం వేడుకలను మందమర్రి పట్టణంలో బుధవారం ఘనంగా జరిగింది. పీరీల మండపాల వద్దకు వెళ్లిన ప్రజలు పీరీలకు కుడకల పేర్లు వేసి దస్తీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామాల్లో పీరీల ఊరేగింపును నిర్వహించారు. ప్రజలు పీరీల వద్దకు వెళ్లి కుడకలు వేసి, దస్తీలను కట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.

జైపూర్: మండలంలోని ఇందారం , టేకుమట్ల, మిట్టపల్లి, జైపూర్ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు.

బెల్లంపల్లి: కాంటా చౌరస్తా వద్ద మొహర్రం సందర్భంగా షరబత్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ పట్టణాధ్యక్షుడు ఎలుక ఆకాష్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కుమార్, ముక్తర్, మోహిన్, మగ్దుమ్, అన్వర్, ముజ్జు, గౌస్, రాజ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో పీరీలను దర్శించుకుంటున్న భక్తులు

భీమారం: మండలంలోని గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు పీరీల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుల మతాలకు అతీతంగా పీరీలను దర్శించుకున్నారు. భీమారంలోని రాగిచెట్టు వద్ద, ఎస్సీ హాస్టల్ సమీపంలో పీరీల గుండాలను ఏర్పాటు చేశారు. రెండు చోట్ల నుంచి పీరీలను డప్పుచప్పుళ్లతో బస్టాండ్ వద్దకు చేరుకోగా ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు.

వేమనపల్లి: నీల్వాయి, వేమనపల్లి, ముల్కలపేట గ్రామాల్లో మొహర్రం వేడుకలను నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా భక్తులు పీరీలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో పీరీలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.



నర్సింగాపూర్‌లో పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



దండేపల్లిలో..

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 4,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.833 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి 22.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మురుగునీటితో అవస్థలు

- పట్టించుకోని అధికారులు



ఇళ్ల సమీపంలో నిలిచిన మురుగునీరు

బెల్లంపల్లి, జూలై 17: బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లల్లోకి వరద, డ్రైనేజీ నీరు చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూమురికి కాలువల నీళ్లు వస్తుండడంతో చుట్టు పక్కల ఉన్న ఇండ్లు మునిగిపోతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఆటో స్టాండ్ వద్దకు వేచి ఉండేందుకు సైతం ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇళ్లలోకి నీరు వస్తుండడంతో దోమ లు, ఈగలు, పాముల బెడద ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయంపై పలువురు స్థానికులు పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శాంతి భద్రతలపై కఠినంగా వ్యవహరించాలి



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి(తాండూర్), జూలై 17: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీసీపీ భాస్కర్ సూచించారు. తాండూర్, మాదారం పోలీస్‌స్టేషన్‌లను డీసీపీ బుధవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిసరాలను పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు, స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులు, ఏ గ్రామాల్లో నేరాలు అధికంగా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని, సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేరాల అదుపుకు కృషి చేయాలని, రోడ్డు భద్రతపై వాహనదారులకు అవ గాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ కిరణ్‌కుమార్, మాదారం ఎస్‌ఐ ఉన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



నస్పూర్‌లో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నస్పూర్, జూలై 17: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ధృవ పత్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నస్పూర్‌లో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి గుర్తింపు పత్రాలు, పొందని వారికి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నస్పూర్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు మొండయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ప్రశాంత్, శ్రీధర్, శ్రీనివాస్, కె శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలో ఆర్‌ఎంపీలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాధవరపు నర్సింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆర్‌ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సూరం రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు షైదం రవీందర్, ఆర్‌ఎంపీ లు కిరణ్, లక్ష్మీరాజిరెడ్డి, లింగన్న, శంకర్, బాలు, రాము, శ్రీనివాస్, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



మంచిర్యాలలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంచిర్యాల అర్బన్, జూలై 17: జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రజలు తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హిందూ పండుగల్లో ఎంతో విశిష్టత కల్గిన తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం పట్టణంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విష్ణుమూర్తిని కొలవడం ఏకాదశి ప్రత్యేకత కావడంతో వైష్ణోదేవాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక విశ్వనాథ ఆలయంలో అర్చకులు పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుంచే భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఏసీసీ: పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలో యాచకులకు తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జుమ్మిడి గోపాల్,చేరాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: తొలి ఏకాదశి పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామితో పాటు ఇతర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశి పర్వదినాన్ని తెలుగు ప్రజలు తొలకరి పండగగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. బుధవారం ఉదయం గూడెం వద్ద గోదావరినదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

నస్పూర్: తెలుగు పండగల పర్వదినాల్లో మొట్టమొదటి సారి వచ్చే తొలి ఏకాదశి పండగను బుధవారం నస్పూర్ పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సీతారాంపల్లి గోదావరి నదిలో పుణ్యస్నానాలను భక్తులు ఆచరించారు. ఇళ్ల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించుకుని ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నూరు: పట్టణంతో పాటు మండలంలో ఆస్నాద, ఓత్కులపల్లి, కిష్టంపేట, సోమనపల్లి గ్రామాల్లో ప్రజలు తొలి ఏకాదశి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఉదయం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం దేవాలయాలకు వెళ్లిప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ఉదయం వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

కోటపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు.పారుపెల్లిమూల మలుపు వద్ద , గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. మరో వైపు ఉపవాస దీక్షలు చేసి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

భీమారం: మండలంలో తొలిఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల ప్రజలు చెన్నూరులోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసిన అనంతరం కోదండరామాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వేమనపల్లి: మండలంలోని తొలి ఏకాదశి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఇండ్లను శుభ్రం చేసుకుని నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నీల్వాయిలోని శివాలయంలో మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గాలి మధు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలంలో తొలి ఏకాదశి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టారు.

భూములను ఎమ్మెల్యే ఇప్పించారు

- ఆస్నాద గ్రామ రైతుల వెల్లడి

చెన్నూరు, జూలై 1 : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తమ భూములు తమకు ఇప్పించారని ఆస్నాద గ్రామ రైతులు తెలిపారు. స్థానికంగా బుధవారం సమావేశంలో పలువురు మాట్లాడారు. 60 ఏళ్లకు పైగా తమ గ్రామంలో భూములు సాగు చేసుకుంటుంటే అటవీ శాఖ అధికారులు వచ్చి అడ్డుకున్నారని చెప్పారు. ఈ భూములు ఫారెస్టుకు సంబంధించినవని, సాగు చేయొద్దని చెప్పారని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు తెలుపగా ఆయన వెంటనే డీఎఫ్‌వో, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి జాయింట్ సర్వేచేయించి తమ భూములు తమకు ఇప్పించారని వివరించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాపాగౌడ్, నాయకుడు హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఎమ్మెల్యే నెరవేస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో చెన్నూరి రాజేష్‌సత్తయ్య, పాశయ్య, చంద్రయ్య, సత్తక్క, శంకరమ్మ, మణెమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి కమాండెంట్‌కు సన్మానం

హాజీపూర్, జూలై 17: గుడిపేట 13వ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అడిషనల్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష కమాండెంట్‌గా పదోన్నతి పొంది మూడో బెటాలియన్‌కు బదిలీ అయిన సందర్భంగా బుధవారం అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సయ్యద్ జమీల్ భాష మాట్లాడుతూ విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బందికి తనకు ఎంతగానో సహకరించారని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెం ట్ రఘునాథ్ చౌహాన్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది, పాల్గొన్నారు. కాగా గుడిపేట 13వ బెటాలియన్ కమాం డెంట్‌గా 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ శ్రీనివాసరావు నియమితులయ్యారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

జైపూర్, జూలై 17: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్న ఆలయం సమీపంలో ఈ నెల 11న ఆటో ట్రాలీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన సూరం బ్రహ్మారెడ్డి (55) అనే సింగరేణి కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెం దినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. చెన్నూరుకు చెందిన సూరం బ్రహ్మారెడ్డి ఆర్కే 6 గనిలో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న విధులు ముగించుకుని మంచిర్యాల నుంచి చెన్నూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెన్నూరు నుంచి జైపూర్ వైపు వెళ్తున్న ట్రాలీ బ్రహ్మారెడ్డి ద్విచక్రవాహ నాన్ని వెలిశాల మల్లన్న ఆలయం సమీపంలో ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బ్రహ్మారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తూ మృతిచెందాడు.. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా కట్ట పోచమ్మ బోనాలు

మంచిర్యాల అర్బన్, జూలై 17: జిల్లా కేంద్రంలో హమాలీవాడ కట్ట పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నల్ల కోటమ్మ-లక్ష్మయ్య ట్రస్టు చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్, కౌన్సిలర్ నల్ల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం బోనాలు నిర్వహించారు. జోగిని శ్యామలదేవి హాజరు కాగా ప్రేంసాగర్‌రావు కుమారుడు, కోడలు చరణ్-శైలేఖ్యలు పాల్గొన్నారు. హనుమాన్ ఆలయం నుంచి పోచమ్మ ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, అర్చకులు సంగర్సు సంతోష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఉస్కమల్ల శంకర్, ఇసంపల్లి శ్రీను, నాగరాజు, సురేష్, చంటక్క, సాంబలక్ష్మి, లింగాల మల్లేష్, జెట్టి శంకర్ పాల్గొన్నారు.

చాతుర్మాస దీక్షలు ప్రారంభం



దీక్షలను ప్రారంభిస్తున్న గురుస్వామి

నస్పూర్, జూలై 17: నస్పూర్ కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అవరణలోని గీతా ప్రశాంతి నిలయంలో శ్రీమద్భగీత సత్సంగం వెల్ఫేర్‌సొసైటీ ఆధ్వర్యంలో బుధ వారం చాతుర్మాస దీక్షలు ప్రారంభమైయ్యాయి. రోటి గూడ శ్రీశ్రీశ్రీ మౌనస్వామి భక్తులకు 62 రోజుల దీక్ష మాలధారణ చేశారు. అంతకు ముందుగా గజోదరణ జెండా ను మౌనస్వామి ఆవిష్కరించారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికుమార్




మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, జూలై 17: పట్టణంలోని గుట్టు చప్పుడుగా గంజాయి విక్రయిస్తున్న గుర్రాల అనిత అనే మహిళను మందమర్రి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మహిళ వద్ద నుంచి 1 కిలో 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ వివరాలను వెల్లడించారు. గుర్రాల అనిత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయిని విక్రయిస్తుందన్నారు. ఈమెకు విద్యానగర్‌కు చెందిన మక్కల గంగాధర్‌కు డబ్బులు ఇచ్చి గంజాయి తేవాలని చెప్పగా చంద్రపూర్‌కు వెళ్లి 2 కిలోల గంజాయి తీసుకువచ్చి అనితకు ఇచ్చాడు. ప్యాకెట్లుగా చేసి అనిత కొంత మందికి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 300లకు విక్రయించేది. సమాచారం మేరకు అనిత ఇంట్లో సోదాలు చేయగా కిలోగంజాయి లబించిందన్నారు. ఈ మేరకు అనితపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ రవికుమార్ తెలిపారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.. సమావేశం లో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రాము, మహిళ హెడ్ కానిస్టేబుల్ పద్మ, హోంగార్డు ఉమ పాల్గొన్నారు. వీరిని రామగుండం సీపీ అభినందించారు.

జిల్లాలో ముసురు వాన



బెజ్జూరులో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు



పెంచికలపేటలో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు

ఆసిఫాబాద్, జూలై 17: జిల్లాలో మంగళ వారం రాత్రి నుంచి బుధవారం మధ్యా హ్నాం వరకు ముసురువాన కురిసింది. గడిచిన 24 గంటలలో జిల్లా వ్యాప్తంగా 13.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షంతోపాటు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కుమరంభీం ప్రాజెక్టులోకి 1146 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండుగేట్లు పైకిఎత్తి 1314క్యూసెక్కుల వరద నీటిని అధికారులు కిందికి వదులుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు పెద్దవాగు నది పరివాహక ప్రాంతాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కురుస్తున్న ముసురువానతో పత్తి పంటకు అనుకూలంగా మారింది. జిల్లాలో 3.5లక్షల ఎకరాల్లో పత్తిపంటను సాగుచేస్తుండగా ఈ వర్షాలు పంటకు ఎంతో ప్రయోజనం చేకూర్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని దహెగాంలో 44.6మిల్లీమీటర్లు, పెంచికల్‌పేటలో 37.2, వాంకిడిలో 36.4, కౌటాలలో 26.8, ఆసిఫాబాద్‌లో 14.2, చింతలమానేపల్లిలో 9.6, బెజ్జూర్‌లో 9.2, కాగజ్‌నగర్, సిర్పూర్(టి)లలో 6.8, కెరమెరిలో 2.0, తిర్యాణిలో 1.8, రెబ్బెనలో 1.6, జైనూరు, సిర్పూర్(యు)మండలాల్లో 1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా దహెగాంలో 44.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా జైనూరు, సిర్పూర్(యూ) మండలాల్లో 1.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కమ్ముకున్న ముసురు..

బెజ్జూరు/చింతలమానేపల్లి/పెంచికలపేట/దహెగాం:మండలాల్లో బుధ వారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకదాటిగా ముసురు వర్షం కురిసింది. దీంతో రైతులు వ్యవసాయ పను లకు ఆటంకం ఏర్పడింది. ఏకదాటిగా కురిసిన ముసురు వర్షానికి ఆయాగ్రామాల్లో అంతర్గతరోడ్లు పూర్తిగా బురదమంగా మారడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వరినాట్లు వేసుకోవడానికి, పత్తిపంటకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందపడుతున్నారు.



దహెగాంలో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు

ఆశ్రమం వద్ద మొక్కలు నాటిన అభ్యాసకులు

రెబ్బెన, జూలై 17: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో శ్రీ రామచంద్రమిషన్ యోగాశ్రమం వద్ద బుధవారం తొలిఏకాదశిని పురస్కరించుకొని సాముహిక ధ్యానకార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



ఆసిఫాబాద్‌లో పీరీలను ఊరేగిస్తున్న నిర్వాహకులు



జైనూర్: సోనపటేల్‌గూడలో సవారీలను పట్టుకున్న యువకులు



సిర్పూర్(యు)లో పీరీల ఊరేగింపు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 17: త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగ బుధ వారం భక్తిశ్రద్ధలతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి, హడ్కోకాలనీ, కంచుకోట, జన్కాపూర్, గొడవెల్లితోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లో మొహర్రం చివరిరోజు పండుగను ఘనంగా నిర్వహించారు. మలీద ముద్దలతో, బెల్లం షరబత్‌తో ప్రత్యేక వంటకాలతో డప్పు చప్పుల నడుమ వేలాది మంది భక్తులు సందడి చేస్తూ ఘనంగా నిర్వహించారు. పీరీల బంగ్లా నుంచి నృత్యాలు చేస్తూ ఉత్సవాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నయీమ్, హసీన్, సుధాకర్, నారాయణ, బాబా, రఫీక్, రాకేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలోని సోనుపటేల్‌గూడ, పట్నాపూర్, కరీంగూడ, తదితరగ్రామాల్లో మొహర్రం బుధవారం వైభవంగా ముగిసింది. కరీంగూడలో హజ్రాబ్ బారఈమామ్ దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాలేజీగూడలో సవారీలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామపటేల్ అనక మారుతి, రాంజీ, దౌలత్‌రావ్, మహజన్ గేడాం మారు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంతోపాటు ప్రెసిడేంట్‌గూడ, పాములవాడ, పంగడి తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో మతాలకు అతీతంగా ఘనంగా జరుపుకున్నారు. లింగాపూర్ మండలం పటకల్‌మంగి, జైనూర్ మండలం పాలోన గ్రామంనుంచి పీరీలను మండల కేంద్రానికి తీసుకొచ్చారు. ఆయాగ్రామాల నుంచి వచ్చిన పీర్లలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించారు.

కాగజ్‌నగర్/రెబ్బెన: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పీరీలకు మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని భట్టుపల్లి, బారెగూడతో పాటుపలుగ్రామాల్లో అట్టహాసంగా మొహర్రం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా షర్బత్, మలీదలు నైవేద్యంగా సమర్పించారు. కులమతాలకు అతీతంగా ఈ పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. కార్యక్రమాల్లో దేవ రవినోద్, మల్లేష్, మందయ్యమెంగాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు. రెబ్బెనమండలంలోని పుంజుమేరగూడలోని భువమ్మ తల్లిదేవస్థానంలో పెద్దసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వినోద్ జైస్వాల్, నికోడే శ్రీకర్, శ్రీకాంత్, నిమ్మాజీ, భగవాన్, రాకేష్, దుర్గం వెంకటి, బొడ్డు రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తులకు షర్బత్ పంపిణీ చేశారు.

బెజ్జూరు: మండలకేంద్రంతోపాటు ఎల్కపల్లి, మర్తిడి, కుకుడ తదితరగ్రామాల్లో పీరీలు ఏర్పాటు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోల్కొండ మసీదుకమిటీ ఆధ్వర్యంలో షరబత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు అమీరుద్దీన్, యూసుఫ్‌ఖాన్, మథిల్, తాయోద్దీన్, ఫిరోజ్‌నజీముద్దీన్, తాహిర్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలవ్యాప్తంగా బుధవారం పీరీలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

వాంకిడి: మండలంలోని ఖమాన, వాంకిడి, బంబార, ఇందాని తదితర గ్రామాల్లో పీరీల బంగ్లాల వద్ద ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొహరం పండుగ సందర్భంగా తొమ్మిదిరోజులపాటు ఉన్న ఉపవాసాలను విరమించారు. బాజా భజంత్రీలతో పీర్లను గ్రామవీధుల్లో ఊరేగిస్తూ సమీప చికిలి వాగులో నిమజ్జనం చేశారు. మొహరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కాగజ్‌నగర్ బారెగూడలో పీరిలకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



రెబ్బెన: పుంజుమేరగూడలో భువమ్మతల్లి దేవస్థానం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వాంకిడిలో పీరీల ఊరేగింపు

ముగిసిన అటవీ బీట్ అధికారుల కౌన్సెలింగ్




బీట్ అధికారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్‌టిబ్రేవాల్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 17: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో అటవీశాఖ బీట్‌అధికారుల బదిలీల ప్రక్రియ బుధవారం సాయంత్రం ముగిసింది. జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఆధ్వర్యంలో ఎఫ్డీవో వేణుబాబు, ఎఫ్ఆర్‌వో అప్పలకొండ కౌన్సెలింగ్ ప్రక్రియనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ అటవీ పర్యవేక్షణలో బీట్ అధికారుల పాత్ర ఎంతో ఉంటుందని తెలిపారు. జిల్లాలో 57మందికి బదిలీ జరిగిందని, నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించినట్లు తెలిపారు. అయితే కొంతమందికి అనుకున్న ప్రాంతాల్లో బీట్ దొరక లేదని అయితే వారి వారి సామర్థ్యం మేరకు జిల్లాఅవసరాల మేరకు బీట్‌లు కేటాయించి నట్లు తెలిపారు. కేటాయించిన బీట్‌లో విధులు సక్రమంగా నిర్వహిం చాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అనువంశిక అర్చక కుటుంబాల ఆటపాటలు

వేములవాడ కల్చరల్, జూలై17: తొలిఏకాదశిని పురష్కరించుకుని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయఅనువంశిక కుటుంబాల మహిళలు ఆటపాటలతో భజన కార్యక్రమాలను నిర్వహించారు.రాజన్న అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వర ఆలయంలో ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా అనువంశిక కుటుంబాల మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపి శ్రీస్వామి వారి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.



నడకే.. నరకం

అభివృద్ధికి బాటలు పడాలంటే ప్రధానంగా రవాణా సౌకర్యం మెరుగుపడాలి. అటువంటి రవాణాకు ప్రధానమైన రోడ్లు జిల్లాలో దయనీయ స్థితిలో దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ రోడ్లు జిల్లాలో అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. కొన్ని రోడ్లపై నడవాలంటే కూడా సాధ్యం కాని పరిస్థితి.

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- ముసురువానతో బురదమయంగా రోడ్లు
- అత్యవసర సేవలకు స్పష్ట
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామీణులు



బురదలో నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆసిఫాబాద్ మండలంలోని హీరాపూర్ గ్రామస్తులు (ఫైల్)

ఆసిఫాబాద్, జూలై 17: జిల్లాలో గ్రామీణ రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. చినుకు పడితే చాలు చిత్తడిగా మారి ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. జిల్లాలో మారుమూల గ్రామాలు నేటికీ కనీసం మెరుగైన రహదారులకు నోచుకోని దుస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షం వస్తే చాలు భయంగుప్పిట్లో మగ్గాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక అత్యవసర పరిస్థితుల్లో దేవుడిపై భారం వేయాల్సిందే. గ్రామాల్లో డయేరియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలినట్లయితే వైద్యశిబిరాలు నిర్వహించేందుకు 104, 108 వాహనాలు సైతం వెళ్లలేని దయనీయ దుస్థితి నెలకొంది. పాలకులు ఇస్తున్న హామీలు బుట్టదాఖలవుతున్నాయి. రెండురోజులుగా జిల్లా అంతటా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయం కావ డంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● గ్రామీణ రోడ్లు అధ్వానం..

జిల్లాలో వందలాది గ్రామాలకు వాగులు, వంకల గుండా, అడవుల గుండా ప్రయాణించాల్సిన దుస్థితి. ప్రధానరహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లతోపాటు అంతర్గత రహదారుల వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నేటికీ పల్లెలు అభివృద్ధి నోచుకోవడం లేదు. జిల్లా అధికారయంత్రాంగం నిర్వహించిన అధ్యయనంలో మొత్తం 335గ్రామపంచాయతీల పరిధిలోని 449గిరిజన గూడాలకు అసలు రోడ్డు సౌకర్యం లేనట్లుగా గుర్తించారు. ఇందులో ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి అత్యధికంగా 305గ్రామాలు ఉండగా సిర్పూర్ నియోజక వర్గంలో 144గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉన్నట్లు గుర్తించారు.

● పట్టించుకోని పాలకులు, అధికారులు..

జిల్లాలో 15మండలాల ఉండగా అన్ని మండలాల్లో రహదారుల వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారి నడవడానికి సైతం వీలు లేకుండా పోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్ మండలంతోపాటు వాంకిడి, కెరమెరి, రెబ్బెన, జైనూర్, సిర్పూర్(యు), తిర్యాణి, లింగాపూర్, కాగజ్‌నగర్, బెజ్జూరు, దహెగాం, పెంచికలపేట, సిర్పూర్(టి) మండలాలలో రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా మారాయి. దీంతో ఆయాగ్రామాల ప్రజలు ప్రతినిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బురదలోనే నడుచుకుంటూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అటు పాలకులు కానీ ఇటు అధికార యంత్రాంగం కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలను గుప్పించినా ఎన్నికల అనంతరం వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ రోడ్ల దుస్థితి ఎక్కడవేసి గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడే కరువుడయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతల మయంగా మారిన ఆసిఫాబాద్ పట్టణంలోని హైవే అప్రోచ్ రోడ్డు

రోడ్డు లేక ఇబ్బందులు..

- దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



జిల్లాలో గ్రామీణ రహదారుల వ్యవస్థ పూర్తిగా అధ్వాన్నంగా ఉంది. వర్షాలు కురిస్తే చాలు రోడ్లు పూర్తిగా బురదమయంగా మారి నడవ డానికి సైతం వీలు ఉండదు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామీణ రహదారులను మెరుగుపర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. జిల్లాలో గ్రామీణప్రాంత రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించాలి.

రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉండాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



కుశ్నపల్లి వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, జూలై 17: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఇందుర్గాం, కుశ్నపల్లి, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, పాపన్నపేట గ్రామాలను సందర్శించిన అనంతరం బెజ్జూరు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీకి ప్రభుత్వం సవాలక్ష కొర్రీలు పెట్టి ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా రెండు లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉండాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అనంతరం సోమని, కుశ్నపల్లి ఒర్రెలను పరిశీలించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని రంగనాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, శంకర్, భాస్కర్ రాజు,శ్రావన్,తిరుపతి,వసీఖాన్,శంకర్,తిరుపతి,రాజారాం,శ్యాంసుందర్,రాకేష్, సంతోష్,శ్రీనివాస్,శ్రీనివాస్, లక్ష్మణ్, సంతోష్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు విధించటం దారుణం

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్



మాట్లాడుతున్న కేసరి అంజనేయులుగౌడ్

రెబ్బెన, జూలై 17: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీపై షరతులు విధించటం దారుణమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలో రావటానికి రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు మాత్రం షరతులు విధించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుణమాఫీకి ఆహార భద్రతకార్డు, ఇతరాత్ర వాటి నిచూయించాలని పేర్కొనటం దారుణమన్నారు. 2018డిసెంబరు12కు ముందున్న రైతులకు రుణమాఫీ వర్తించదనే నిబంధన అసమంజసమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి షరతులు లేకుండా రుణమాఫీ ఇవ్వాలని డిమాండు చేశారు. సమావేశంలో రైతులు జంగు, పైకు, మడావి దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

దళాబ్దాల కల.. నెరవేరిన వేళ

● పూర్తయిన బెజ్జూరు-ఎల్కపల్లి బీటీ రోడ్డు



పూర్తైన బెజ్జూరు- ఎల్కపల్లి బీటీ రోడ్డు

బెజ్జూరు, జూలై 17: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఎల్కపల్లి గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేక దశాబ్దాలుగా ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతియేటా వర్షాకాలంలో బురదమయమైన రోడ్డుపై అనేక కష్టాలు పడేవారు. ఎట్టకేలకు ఎల్కపల్లికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక దృష్టి సారించి రూ.1.40 కోట్ల ఐటీడీఏ నిధులు మంజూరు చేయగా గతఅక్టోబర్‌లో రోడ్డుపనులు ప్రారంభించారు. గత సోమవారం అధికారులు బెజ్జూరు నుంచి ఎల్కపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తి చేయించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్నాళ్లు నరకయాతన..

బెజ్జూరు నుంచి ఎల్కపల్లి గ్రామం కేవలం కిలో మీటర్ దూరం మాత్రమే ఉన్నా రోడ్డు సౌకర్యం లేదు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్ద మొరపెట్టుకున్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించలేదు. చివరికి తమ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరవుతుందా లేదా అన్న అనుమా నాలు సైతం గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఎట్టకేలకు అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టి సారించి నిధులు మంజూరు చేయించగా రోడ్డు నిర్మాణం పూర్తయింది.

గుట్కాప్యాకెట్లు పట్టివేత

వాంకిడి, జూలై 17: మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుట్కాను పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడికి చెందిన షహీద్ మంగళవారం రాత్రి మహారాష్ట్రనుంచి వాంకిడివైపు తన ఆటో(టీఎస్ 20టి 4513)లో వస్తుండగా అనుమానం రావడంతో తనిఖీ చేశామన్నారు. ఆటోలో 30గుట్కాప్యాకెట్ల బ్యాగులు ఉన్నాయన్నారు. పట్టుబడ్డ వాటివిలువ దాదాపు రూ.11,22,000ఉంటుందని చెప్పారు. గుట్కాను స్వాధీనపర్చుకుని నిందితుడిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఏఎస్సై పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ ఉన్నట్లు తెలిపారు.

నాటుసారా, రెండు బైక్‌లు స్వాధీనం

రెబ్బెన, జూలై 17: మండలంలోని కైరిగూడ గ్రామంనుంచి వివిధగ్రామాలకు నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి రెండు బైక్‌లను జప్తు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై దీపక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు కైరిగూడ తదితర గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో నాటు సారా విక్రయిస్తున్న లావుడ్య రాంకుమార్, అజ్మీర సీతారంపై కేసు నమోదు చేసి వీరివద్ద ఉన్న రెండు బైక్‌లను జప్తు చేశామన్నారు. వారివద్ద ఉన్న 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, డి.సురేష్, ధను తదితరులు పాల్గొన్నారన్నారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'

వాంకిడి, జూలై 17: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఈవో రవిదాస్ అన్నారు. బుధవారం మండలంలోని వెలిగి ఆశ్రమపాఠశాలలో దోమలమందు పిచికారి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాలలో పరిశుభ్రత లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఎం రమాదేవి, ఏఎన్ఎంలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, జూలై 17: కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద నిర్మించే ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కాగజ్‌నగర్ పద్మశాలిభవన్‌లో బీఆర్ఎస్‌పార్టీ సిర్పూరు నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత ప్రాజెక్టు పూర్తైతే ఉమ్మడి జిల్లా సస్యశ్యామం అవుతుందన్నారు. రూ.4350కోట్లతో నారాయణపేట కొండగల్ ఎత్తిపోతల పథకం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి సిర్పూరు నియోజకవర్గ అతిపెద్ద ప్రాజెక్టుపై ఎందుకు చిన్న చూపు చూస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రూ.1700కోట్లు ఖర్చుచేసినా ఇంతవరకు చుక్కనీరు అందటం లేదన్నారు. ప్రాజెక్టుకు సేకరించిన భూములకు ఇంకా పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదన్నారు. పెంచికల్‌పేట్ మండలంలో ఉన్న తుమ్మిడిహెట్టి, సాండ్‌గాం, రన్‌వెల్లి, కోర్సిని, గూడెం, హుడ్కిలి, లోనవెల్లి, సూర్జాపూర్ ఎత్తిపోతల పథకాలు వెంటనే పూర్తిచేయాలని డిమాండు చేశారు. సిర్పూరు నియోజకవర్గంలో వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌వద్ద ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనేరద్దుచేయాలని డిమాండుచేశారు. ఎన్జీసీఏ అనుమతులు లేకుండాఎలా కట్టనిస్తారని ప్రశ్నించారు. అలాగే కర్జవెల్లి-గూడెం బీటీ రోడ్డుకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. సిర్పూరులో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న వారు తెలంగాణ ద్రోహులుగా మిగులుతారన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి అంతాకృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీమండలాల బాధ్యులను ఎన్నుకున్నారు. సిర్పూరు నియోజకవర్గకన్వీనర్‌గా లెండుగురే శ్యాంరావు,సిర్పూరు మండలానికి అస్లాం బీన్‌అబ్దుల్లా, బెజ్జూరుకు సోయం చిన్నయ్య, కాగజ్‌నగర్‌కు ఆవుల రాజ్‌కుమార్, దహెగాంకు లక్ష్మి, కౌటాలకు బండు, పెంచికల్‌పేటకు బిట్టు శ్రీనివాస్, చింతలమానేపల్లికి గోమాసే లాంచును ఎన్నిక చేశారు.

ఘనంగా తొలిఏకాదశి



ఆసిఫాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 17: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బ్రాహ్మణవాడలోని కేశవనాథ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిర్పూర్(టి)/బెజ్జూరు/దహెగాం/కెరమెరి: సిర్పూర్(టి) మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకుని భజన, ఎక్కామ కార్యక్రమాలను నిర్వహించారు. బెజ్జూరు మండలకేంద్రంలోని రంగనాయక, శివాలయ, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి, దహెగాం మండల కేంద్రంలోని శివకేశవ ఆలయం, లగ్గాంలోని ఉమాచంద్రశేఖర్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయం, బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన 'మోడల్' విద్యార్థులు



విజయకేతనం చూపుతున్న ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 17: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలకు చెందిన 24మంది విద్యార్థులు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అందించే కేంద్ర ప్రభుత్వ ప్రతిభా ఉపకార వేతనాలు (ఎంహెచ్‌ఆర్‌డీ- సీఎస్ఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి 927మార్కులకు పైగా సాధించిన 24మంది విద్యార్థులు మెరిట్ ఆధారంగా ఇంటర్‌బోర్డు విడుదల చేసిన ప్రాథమిక జాబితాలో చోటు సాధించారు. ఎంపికైన వారిలో బి అక్షయ, వి పూజిత, కె హర్షిత, ఎన్ సలోని, బి జ్యోతి, ఎ నాగమణి, జి హర్షిత, చిందం కార్తీక్, ఎస్ హర్షత, బి శశికిరణ్, డి రజిత, ఎన్ సాత్విక, ఎం అక్షయ, కె శ్రావ్య, టి సౌమ్య, ఎం మేఘన, ఎస్ మౌనిక, జి నాగరాణి, జె మమత, జె విహారిక, జి తేజ, ఎస్ మణిదీపిక, అఖిల, డి తిరుమల్ ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు డిగ్రీలో సంవత్సరానికి రూ.10వేల చొప్పున, పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంవత్సరానికి రూ.20వేల చొప్పున మొత్తం రూ.70 వేల ఉపకార వేతనం పొందడానికి అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అధ్యాపకులు అభినందించారు.

చురుకైన నాయకుడిని కోల్పోయాం:ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, జూలై 17: మండలంలోని పార గ్రామంలో చురుకైన నాయకుడు కినక యాదవ్‌రావను బీఆర్ఎస్‌పార్టీ కోల్పోయిందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పారగ్రామాన్ని ఎమ్యెల్యే కోవ లక్ష్మి బుధవారం సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సహకార ఛైర్మన్ కొడప హన్నుపటేల్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ ఎంపీటీసి కుంర భగ్వంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్‌కు చేరుకున్న పండరీపూర్ భక్తులు

జైనూర్, జూలై 17: మహారాష్ట్రలోని పండర్‌పూర్ పుణ్యక్షేత్రానికి కాలి నడకన బయలుదేరిన భక్తులు బుధవారం జైనూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తిపరంగా వారు అనుభావాలను గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా సనాతన హిందూధర్మం బృందం సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఆత్రం భీంరావ్, అధ్యక్షుడు కేంద్రె సుబోధ్, ఉపాధ్యక్షులు రాథోడ్ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి సంస్థను కాపాడుకోవాలి : బీఎంఎస్

శ్రీరాంపూర్, జూలై 17: యూనియన్లకు అతీతంగా సింగరేణి సంస్థను కాపాడుకోవాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మొదటిసారి గుర్తింపు సంఘంగా గెలిచిన యూనియన్ ఏఐటీయూసీ వల్లనే సింగరేణికి ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఆనాడు యాంత్రీకరణ, కాంట్రాక్టీకరణను ప్రోత్సహించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. వారు చేసిన తప్పిదంతో లక్షకు పైగా ఉన్న పర్మినెంట్ కార్మికులు నేడు 39వేలకు తగ్గిపోయారని, బదులుగా కాంట్రాక్టు కార్మికులు పెరిగిపోయారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా భూగర్భ గనులు తీసుకొస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ దానిని మరచిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో గనులతో పాటు ఎస్‌టీపీపీ కూడా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నడుస్తోందని తెలిపారు. అదే యూనియన్ ఇప్పుడు గుర్తింపు సంఘంగా ఉండడంతో సింగరేణి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న గనుల జీవితకాలం ముగిసిపోతున్నందున కొత్త గనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి సాధించాలని, తద్వారా కార్మికుల భవిష్యత్తును కాపాడాలని ఆయన కోరారు.

నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి



ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ

మందమర్రిటౌన్, జూలై 17: ఒడిశారాష్ట్రంలోని నైనీబ్లాకులో బొగ్గు ఉత్పత్తి కోసం ప్రణాళికలు రూపొందించి వీలైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభించేలా చూడాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సీఎం డీ బలరాం, ఎనర్జీ సెక్రెటరీ రొనాల్డ్ రోస్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, ఇందనశాఖ ఓఎస్‌డీ సురేందర్‌రెడ్డికి సూచించారు. బుధవారం హైదరాబాద్ లోని సచివాలయంలో నిర్వహించిన నైనీ బ్లాకులో ఉత్పత్తికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. నాలుగు నెలల్లో ఈ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైతే సింగరేణికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సింగరేణి తొలిసారిగా తెలంగాణ పక్క రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టు అయినందున కంపెనీ ప్రతిష్టను పెంచేలా కృషి చేయాలన్నారు. నైనీబ్లాకుకు అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో 783.27హెక్టార్ల అటవీస్థలంలో చెట్లలెక్కింపు, వాటి తొలగింపు, అప్పగింతపై ఒడిస్సా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినందున అటవీశాఖతో సంప్రదింపులు జరపాలన్నారు. ఇందుకోసం నైనీ జీఎంకు బాధ్యతలు అప్పగించారు. ఏకైక నిర్వాసిత గ్రామప్రజలతో చండీపడ ఎమ్మెల్యే అగస్తిబెహారా స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి పునరావాసం, ఉపాధికోసం తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గరపడ నుంచి చండీపడ వరకు రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. హైటెక్షన్ లైన్‌లను నిర్మించేలా రాష్ట్రశాఖ అధికారులతో సంప్రదించాలన్నారు. పునరావాసం, నష్టపరిహారం అంశాలపై చర్చించి ఆర్‌పీడీఏసీ సమావేశం అతి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. 2015లో సింగరేణికి నైనీ బ్లాకు కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తతవల్ల బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభు త్వంలో అన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. త్వరగా నైనిబ్లాకు నుంచి బొగ్గు ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల ప్రత్యేకతపై శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్‌లోగా బొగ్గు ఉత్పత్తికి కృషి చేస్తామని తెలిపారు.